క్రైం కార్నర్

## రైలు కిందపడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కాచిగూడ, న్యూస్‌లైన్:

రైలు కిందపడి ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం, సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ ఎల్.సుధీర్ కుమార్(45) ఇంట్లో భార్యతో గొడవపడి సీతాఫల్‌మండి – ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం, కుటుంబ సభ్యులకు అప్పగించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువతి అదృశ్యం

కాచిగూడ, న్యూస్‌లైన్:

ఉస్మానియా యూనివర్సిటీలో సర్టిఫికెట్స్ తీసుకొచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం, చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన జి.తులసి(21) బీటెక్ చదువుతోంది. ఈ నెల 11వ తేదీ శనివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి, బంధువుల ఇళ్లలో, వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అనారోగ్యం భరించలేక గృహిణి ఆత్మహత్య

నల్లకుంట, న్యూస్‌లైన్:


మాధవి (ఫైల్)

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జయపాల్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం, గుంటూరు జిల్లా ఎడ్లపాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వంకాయలపాటి వీరయ్య సెక్రటేరియెట్‌లో ఉద్యోగి. భార్య మాధవి(40), కూతురు లక్ష్మి(ఇంజనీరింగ్ మూడో సంవత్సరం) కుమారుడు గోపకిషోర్(ఇంటర్ సెకండియర్)తో కలిసి దయానంద్ నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. భార్య మాధవికి థైరాయిడ్‌తో పాటు భుజం కింది భాగంలో తరుచు నొప్పి వస్తుండడంతో భరించలేక ఆమె తరుచూ ఇంట్లో అరుస్తూ ఉండేది. సోమవారం ఉదయం కూతురు కళాశాలకు వెళ్లిపోగా, కుమారుడు ఇంట్లోనే ఉన్నాడు. అదే సమయంలో బెడ్ రూంలోకి వెళ్లిన మాధవి తలుపులు పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. దీనిని గమనించిన కుమారుడు తండ్రికి చెప్పాడు. వెంటనే ఇరుగు పొరుగుతో కలిసి ఫ్యాన్‌కు వేలాడుతున్న భార్యను కిందికి దింపి ఆస్పత్రికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే, ఆమె శ్వాస విడవడంతో చేసేదేమి లేక ఊరకుండి పోయారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శవ పంచనామ నిర్వహించి మృత దేహాన్ని గాంధీకి తరలించారు. మృతురాలి భర్త వీరయ్య తెలిపిన వివరాల మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**ఆదివారం సాయంత్రం జరిగిన ఘటన...**

ఆదివారం సాయంత్రం కూడా నొప్పి భరించలేక అరిచింది. పిల్లలకు పరీక్షల సమయం నీవు ఊర్కె అరుస్తుంటే పిల్లలు చదువుకు ఆటంకం కలుగుతుందని భర్త మందిలించారు. దీంతో భార్య, భర్తకు ఇద్దరు పిల్లలకు తలా ఓ పేపరు ఇచ్చి, ఎవరెవరెలా ఉండాలో పేపర్ మీద రాయండని ఇచ్చింది. ఇలా అందరూ తమ అభిప్రాయాలను కాగితంపై రాశారు. ఇలా అందరి అభిప్రాయాలను అందరు చదివిన తరువాత ఎవరికి ఇబ్బంది కలుగ కుండా మెలగాలని అందరూ నిర్ణయించుకున్నారు. ఇంతలోనే మనస్తాపానికి గురైన ఆ ఇల్లాలు సోమవారం ఉదయం ఉరి పోసుకుని బలవన్మరణానికి పాల్పడడంతో భర్త, పిల్లలు బోరున విలపించారు.

**సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి**

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల క్రింది ఫోన్ నంబర్లకు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

అంబర్‌పేట, చిక్కడపల్లి
9010201659, 9912440680, 9912440316
టోల్‌ఫ్రీ నం. : 1800 425 9899 (7 A.M. - 8 P.M.)

## వైఎస్ జగన్ నిర్దోషిగా రావాలని చాదర్ ప్రదర్శన



వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత, పార్లమెంట్ సభ్యుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దోషిగా త్వరగా బయటకు రావాలని ప్రార్థిస్తూ ఆజ్మీర్ దర్గాలో చాదర్‌ను సమర్పించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహ్మద్ మొబిన్ తెలిపారు. ఆజ్మీర్ దర్గాలో సమర్పించే చాదర్‌ను సోమవారం రాత్రి కాచిగూడ డివిజన్ కృష్ణానగర్, నెహ్రునగర్ ప్రాంతాల్లో ర్యాలీగా ప్రదర్శించారు. చాదర్‌ను తీసుకుని 40 మంది మైనార్టీ సోదరులు ఈ సందర్భంగా ఆజ్మీర్ దర్గాకు బయల్దేరి వెళ్ళారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, ఎస్.హరినాథ్‌రెడ్డి, కాలేరు శ్రీనివాస్‌రావు, ప్రతాప్ గౌడ్, దేవిరెడ్డి విజితారెడ్డి, ఎడ్ల నరేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, యాదగిరి ముదిరాజ్, వెంకట్‌గౌడ్, భరత్‌రాజ్, కాలేరు రాజు, కె.పవన్, మథిన్ బాయి, చాంద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

– న్యూస్‌లైన్, కాచిగూడ

## నర్సింగ్ వృత్తి వైద్య రంగానికి వెన్నెముక

**ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్**

నల్లకుంట, న్యూస్‌లైన్: దేశ వైద్య వ్యవస్థకు నర్సింగ్ వృత్తి వెన్నెముక లాంటిదని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ అన్నారు. వైద్యులు లేని గ్రామాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు నర్సుల సేవలను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి నర్సింగ్ ఇన్‌చార్జ్ శ్యామలా, ఫెలూషియాల ఆధ్వర్యంలో నర్సింగ్ వ్యవస్థాపకులు ఫ్లోరె న్స్ నైటింగేల్ జయంతి వేడుకల ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూపరింటెండెంట్ ఫ్లోరెన్సీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. వైరాలజీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.మీరా బాయి మాట్లాడుతూ నర్సింగ్ రంగం ఆధునిక వైద్య వృత్తిగా మారిందని, వైద్యులు, రోగులకు మధ్య అనుసంధానకర్తగా ఈ రంగం కీలక పాత్ర పోషస్తుందన్నారు. నర్సింగ్ వృత్తిలో అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. జయంతి వేడుకల్లో డాక్టర్ రాజారావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్స్ కె.ఉపేందర్ రెడ్డి, రాజు, స్టాఫ్ నర్స్ మేరీ హేమలత కోలి పాల్గొన్నారు.

### వేసవిలో తరగతులు నిర్వహించే..

## కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గం**

నల్లకుంట, న్యూస్‌లైన్: బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సెంట్రల్ జోన్ ఇన్‌చార్జ్ కల్యాణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రేమ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. నల్లకుంట మెయిన్ రోడ్డులోని నారాయణ జూనియర్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు కళాశాల ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం, కళాశాల ప్రిన్సిపాల్ కొండల్‌రావును కలిసి వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు క్లాసులు తీసుకుంటున్నారని నిలదీశారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ స్పందిస్తూ జూన్ మొదటి వారం వరకు తరగతులు తీసుకోమని చెప్పి, వెంటనే తరగతుల్లో ఉన్న విద్యార్థులకు ఇళ్లకు పంపించివేశారు. దీంతో ఏబీవీపీ నాయకులు ఆందోళన విరమించారు. ఆందోళన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రమాకాంత్, హేమంత్, నరేశ్ పాల్గొన్నారు.


నారాయణ కళాశాలలో విద్యార్థుల ఆందోళన

## టీఆర్ఎస్‌లో చేరిన ఎడ్ల సుధాకర్‌రెడ్డి

**కేసీఆర్ సమక్షాన తెలంగాణ భవన్‌లో సభ్యత్వ స్వీకరణ**

గోల్నాక, న్యూస్‌లైన్: అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, స్థానికుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం కేసీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ మేరకు పార్టీకి చెందిన నాయకులు పాక చందర్, జె.భాస్కర్‌గౌడ్, కె.సత్యం, రంగారెడ్డిల సమక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు తెలిసింది. ఆదివారం మంచిరోజు కావడంతో సుధాకర్ రెడ్డి పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 19న లేదా 26వ తేదీల్లో స్థానికంగా పెద్ద ఎత్తున బహిరంగసభ ఏర్పాటు చేసి కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు సమాచారం.

## మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

సాక్షి, సిటీబ్యూరో: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించినప్పుడే ప్రపంచ దేశాలతో మన దేశం పోటీ పడగలుగుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జోతిష్య వాస్తు నిలయం షష్టమ వార్షికోత్సవం న్యూ నల్లకుంటలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్‌బీఐ ఏజీఎం త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు అతి తక్కువగా ఉండే జోతిష్య రంగంలో పద్మజా రాణి డాక్టరేట్ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ జోతిష్య పండితురాలు డాక్టర్ పద్మజారాణి, పలువురు ప్రముఖులు శ్రీనందగోపాల్, ఏవీ రామకృష్ణ, హరిహరనందన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణపై కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి లేదు

**తెలంగాణ లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నారం నాగరాజు**

చిక్కడపల్లి, న్యూస్‌లైన్: కాంగ్రెస్, టీఆర్ఎస్‌లకు తెలంగాణ అవసరం లేదని, సీట్లే ప్రధానంగా అధికారం కోసం పార్టీలు వ్యవహరిస్తున్నాయని తెలంగాణ లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నారం నాగరాజు విమర్శించారు. ఆర్టీసీక్రాస్ రోడ్డులో తెలంగాణ లోక్‌సత్తా ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చి దొరల అహంకారాన్ని తలపిస్తుందన్నారు. ఒక పక్కన సీమాంధ్ర అగ్రకులాల పెత్తందారులు అడ్డుకుంటే, మరో పక్క తెలంగాణ రెడ్డిలు, వెలుమ దొరలు, దొరసానులు తెలంగాణవాదాన్ని కనుమరుగు చేసేందుకు పూనుకుంటున్నారన్నారు. 60 ఏళ్ల తెలంగాణలో ఉన్న భూస్వాములు, దొరలు, తెలంగాణను అడ్డుకుంటూ రాజకీయ అధికారం చేపట్టారని ఆరోపించారు. అప్పటి చెన్నారెడ్డి తెలంగాణను అడ్డుకున్నారని, ఇప్పటి తెలంగాణ నాయకులు కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో డబ్బున్న వారికే సీట్లు ఇవ్వడం వల్ల తెలంగాణవాదాన్ని అణిచివేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారు వెయ్యి మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే అధిక శాతం అమరులైన వారిలో ఎక్కువ శాతం బడుగు, బలహీన వర్గాల వారే ఉన్నారన్నారు.

సాక్షి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలుచుకుంటే సంప్రదించండి.

బి. శివరామకృష్ణ- 9912220568